Kaloji Narayana Rao Memorial Lecture 2026



తెలంగాణ సాహిత్యం: ప్రజల గొడవ

డా॥ కె. శ్రీనివాస్

ప్రఖ్యాత పాత్రికేయులు,

మాజీ సంపాదకులు, ఆంధ్రజ్యోతి దినపత్రిక

Organised by

Dr.B.R. Ambedkar Open University,

Prof.G.Ram Reddy Marg, Road No. 46,

Jubilee Hills, Hyderabad (TS) 500 033



About Dr. BRAOU

The University, initially known as Andhra Pradesh Open University, was set up on 26th August 1982 through an Act of the A.P.State Legislature (APOU Act 1982). Subsequently the University was renamed as Dr.B.R.Ambedkar Open University on 26th October,1991. The establishment of this University, the first of its kind in India, heralded and era of affirmative action on the part of the Government to provide opportunities of higher education to all sections of society to meet the changing individual and social needs. The University is providing services to the student community through a wide network of 104 study centres spread across the Telangana state including 10 Regional Co-ordination centres and 6 centres exclusively meant for women students. Prison inmates under life sentence also enrol themselves as students and pursue education through exclusive study centres at Central Prison - Cherlapally, Warangal an exclusive Study Centre for Army Personal and their family members, which was located at AOC, Secunderabad. The University offers UG, PG Degree, Certificates, Diploma and Ph.D. programmes including various Professional Programmes.

కాళోజీ స్మారకోపన్యాసం
2026

తెలంగాణ సాహిత్యం: ప్రజల గొడవ

డా॥ కె. శ్రీనివాస్

ప్రఖ్యాత పాత్రికేయులు,

మాజీ సంపాదకులు, ఆంధ్రజ్యోతి దినపత్రిక

Dr. B.R. Ambedkar Open University

Prof. G.Ram Reddy Marg, Road No. 46,

Jubilee Hills, Hyderabad (TS) 500 033

తెలంగాణ సాహిత్యం: ప్రజల గొడవ

డా॥ కె. శ్రీనివాస్

ప్రఖ్యాత పాత్రికేయులు,

మాజీ సంపాదకులు, ఆంధ్రజ్యోతి దినపత్రిక

"నేను ప్రస్తుతాన్ని, నిన్నటి స్వప్నాన్ని, రేపటి జ్ఞాపకాన్ని, గతానికి శిఖరాన్ని, భావికి ఆధారాన్ని" – కాళోజీ, నా గొడవ

కాళోజీ నారాయణరావు వ్యక్తిత్వంలో సాహిత్యం విడదీయరాని భాగం. ఆయన తెలుగువారి సాహిత్య, సామాజిక జీవితంలో శిఖరంలాంటి వ్యక్తి. ఇరవై నాలుగేళ్లు గడచిపోయినా, ఆయన మనకు ఇంకా 'ప్రస్తుతం' గానే ఉన్నారు. ఒక దిగులు, ఒక విసుగు, ఒక వలపోత, కొంత తలపోత, కాసింత ఆగ్రహం, అంతలోనే దుఃఖం – ఇదీ కాళోజీ. ఈ అన్ని ఉద్వేగాలూ ఆయన సొంత బాధల నుంచి పుట్టినవి కావు. శ్రీశ్రీ గురించి అన్నాడే చలం, ప్రపంచపు బాధ తనది అని, అది కాళోజీకి కూడా వర్తిస్తుంది, ఆ మాటకొస్తే, ఇంకాస్త ఎక్కువే వర్తిస్తుంది. 'నా గొడవ' అని ఆయన రాసుకున్న కవిత్వమంతా ప్రపంచపు గొడవే. ప్రజల గొడవే. పర్సనల్ ఈజ్ పొలిటికల్. పొలిటికల్ ఈజ్ పర్సనల్ కూడా.

"నా గొడవనునది /అక్షరాల జీవనది/ నానా భావన నది/నీనా భావన లేనిది/ .....ఎదచించుక పారునది/ఎదలందున చేరునది" అని కాళోజీ చెప్పుకున్నారు.

"ఇది కవి గొడవగానే కనిపించినప్పటికి చదివిన వారికి తమ గొడవగానే అర్థమవుతుంది' అని శ్రీశ్రీ నాగొడవ గురించి అన్నారు.

'అన్యాయాన్నెదిరిస్తే నాగొడవకు సంతృప్తి...
అన్యాయం అంతరిస్తే నా గొడవకు ముక్తి ప్రాప్తి"

అన్న పంక్తులు కాళోజీ కలవరం అంతా సామాజిక అన్యాయాల మీదనే అని స్పష్టం చేస్తాయి.

అటువంటి కాళోజీ నారాయణరావును జ్ఞాపకం చేసుకుంటూ, ఈ సంభాషణ ద్వారా తెలంగాణ సాహిత్యాన్ని ఒకసారి క్లుప్తంగా సమీక్షించుకునే ప్రయత్నం ఇది.

తెలంగాణ సాహిత్యం కానీ, దాని చరిత్ర కానీ సుదీర్ఘమైనవి. అనేక శాఖోపశాఖలుగా ఉన్న సంపద అది. దాన్నంతటినీ ఇక్కడ చర్చించడానికి సమయం సరిపోదు. చరిత్రలో తెలంగాణ కవులకు, సాహిత్యానికి కొన్ని ప్రత్యేకతలున్నాయి. విశిష్టతలున్నాయి. శైలీశిల్పాలకు, కావ్యరీతులకు సంబంధించి, కొన్ని కాలాలలో, కొన్ని లోటుపాట్లు కూడా ఉండి ఉండవచ్చు. అనంతర కాలంలోను, నేటికాలంలోను కూడా గొప్పవనుకుంటున్న కొన్ని విలువల మూలాలు, పాదులు చారిత్రకకాలంలోనే తెలంగాణలో ఉన్నాయనిపిస్తుంది. వాటిని గుర్తిస్తూ, పదేపదే వాటిని పునశ్చరణ చేసుకుని, జ్ఞానంలో, జ్ఞాపకంలో వాటిని స్థిరపరచుకోవలసిన అవసరం ఉంది.

ఇప్పుడిప్పుడే ఆవిష్కరించుకుంటున్న తెలంగాణ సమగ్ర సాహిత్యచరిత్రలో, తెలంగాణ చారిత్రక కథనంలో కాళోజీ నారాయణరావు ఒక సహజమైన, స్వాభావికమైన పాత్ర. గడచి వచ్చిన సహస్రాబ్దుల చరిత్ర, తదనంతర అత్యాధునిక చరిత్రల అంతర్లీన పరంపరలో కాళోజీ ఒకభాగం. కాళోజీ ప్రత్యేకమైన స్వరం, తెలంగాణ సాహిత్యచరిత్ర అంతటిలోనూ విశిష్టంగా ధ్వనించే స్వరపరంపరలో భాగమే అనిపిస్తుంది.

ఒక పాల్కురికి సోమన, ఒక బమ్మెర పోతన, ఒక కాళోజీ– వీరి సాహిత్య వ్యక్తిత్వాలలో ప్రస్ఫుటమైన పోలికలు కనిపిస్తాయి.సామాజిక ధిక్కారం, రాజకీయ ధిక్కారం, స్వేచ్ఛావ్యక్తీకరణ వారి సామాన్య లక్షణాలు. కవిత్వాన్ని జనానికి దగ్గరగా తీసుకురావడం, శిష్ట, మార్గధోరణులకు ఎడంగా చరించడం, గోనబుద్ధారెడ్డి దగ్గర నుంచి గోరటివెంకన్న దాకా కనిపించే లక్షణమే. ప్రజల కోసమే సాహిత్యం అన్నదిఆధునిక కాలంలోతప్ప రాలేని నినాదమే అయినా, ప్రజలు నడిచే దారిని కవిత్వం చేసిన ఆనవాయితీ మాత్రం గాథాశప్తశతి కాలం నుంచి పండగ శాయన్న కథ దాకా కొనసాగిన వాస్తవం.

పాతిక సంవత్సరాల కిందట, కాళోజీ ఇంకా సజీవులై ఉండగానే,ఈ ఉపన్యాసకుడు 'ప్రజాతంత్ర' పత్రికలో ఒక వ్యాసం రాస్తూ, ప్రధాన స్రవంతి సాహిత్యచరిత్ర కాళోజీకి న్యాయమైన పరిగణన అందించలేదన్న ఆవేదనను ప్రకటించాడు. ఆ వివక్ష వెనుక, తెలంగాణ సాహిత్య ప్రత్యేకతలను, నిర్దిష్టతలను పరిగణనలోకి తీసుకోకపోవడం ఉన్నదని వ్యాఖ్యానించాడు.

"..తెలుగు లెస్స అన్నాడని బ్రహ్మరథం పట్టిన కృష్ణరాయల హయాంలో

సంస్కృతపదభూయిష్ఠ కావ్యాలు వస్తే, తురుష్క పాలనలో తెలంగాణ అచ్చతెనుగు కావ్యాన్ని సృష్టించిందని ఇప్పటివరకూ సాహిత్య చరిత్ర వ్యాఖ్యానించనే లేదు. తెలంగాణలో గత మూడు శతాబ్దాలుగా వచ్చిన సాహిత్యం, ముఖ్యంగా 'శిష్టపరిగణన'కు వెలుపల వచ్చిన సాహిత్యం ఇంకా నిశిత పరిశీలనకే నోచుకోలేదు. పాటకే కాదు, తెలంగాణాలో పద్యానికి కూడా సార్వజనీన ఆదరణ ఉండింది. 1960 దశకం వచ్చేదాకా తెలంగాణ వ్యక్తీకరణకు వచనకవిత్వం అవసరమే లేక పోయింది. వాడుకభాష విషయంలో, ఛందస్సు విషంలో తెలంగాణా తన ప్రాధాన్యాలను తాను నిశ్శబ్దంగా ఎంపిక చేసుకుంది. సాహిత్యచరిత్రలో, సాహిత్యరంగంలో ఒక ప్రత్యేకమైన, భిన్నమయిన సరళిని నిలుపుకున్న తెలంగాణ కవిత్వ వ్యక్తీకరణను అర్థం చేసుకోవడానికి 'ఆధునిక' కోస్తాంధ్ర సాహిత్యం వద్ద ప్రమాణాలేమయినా ఉన్నాయా? కాళోజీమాత్రాఛందస్సును, సూటి, సరళ వ్యక్తీకరణలను కాదనడానికి ఏవైనా కొలమానాలున్నాయా' అని నాటి వ్యాసంలోప్రశ్నించాను. ఆ పరిశీలనలో నాటికాలపు పరిమితులు కొన్ని ఉన్నప్పటికీ, తెలంగాణ సాహిత్య క్రమాన్ని అర్థం చేసుకోవడానికి ప్రత్యేకదృష్టి అవసరమన్న గుర్తింపు ఉన్నది.

తెలంగాణ సమాజం కేవలం ప్రధాన స్రవంతి తెలుగు సాహిత్యం నుంచి మాత్రమే స్వీకరించలేదు. తనలోకి మాత్రమే తాను చూడలేదు, పాడుకోలేదు. ఉత్తర, మధ్యభారతాల్లోని ప్రజాసాంప్రదాయాల నుంచి, పాలకుల అరబిక్ Image పర్షియన్ భాషాసాహిత్యాల నుంచి కూడా ప్రభావాలను అందుకుంది. కాళోజీ ఆ మిశ్రమానికి, తెహజీబ్కు కూడా ప్రతినిధి. ఆయన స్వయంగా మహారాష్ట్ర, కన్నడ ప్రాంతాల నుంచి వచ్చి, తెలంగాణలో పెరిగి, ఉర్దూ తెలుగు భాషల్లో సమ ప్రవీణుడై– దక్కనీ తనాన్ని పుణికి పుచ్చుకున్నాడు. పద్మవిభూషణ్ పొందిన తరువాత కాళోజీకి పెద్ద సన్మానం జరిగిన సందర్భంలో, నాటి ప్రధానమంత్రి పి.వి. నరసింహారావు మాట్లాడుతూ, కబీర్, నామ్దేవ్ వంటివారి 'దోహా' కవిత్వ సంప్రదాయం నుంచి కాళోజీ కవిత్వాన్ని అర్థం చేసుకోవాలని ప్రతిపాదించారు. దక్కన్, తెలంగాణ సమాజంలో ప్రభావం వేసిన ప్రజాకవిత్వ సంప్రదాయంలో భాగంగా కాళోజీని ఆయన చూశారు.

సామాజిక, మత సంస్కార ఉద్యమాలలో ప్రజల ప్రాధాన్యాలను దృష్టిలో పెట్టుకుని వ్యక్తీకరణలను ఎంచుకోవడం తెలంగాణలో ఎప్పటి నుంచో ఉన్నది. ప్రజల గొడవను

సాహిత్యంలో పలికే ప్రయత్నాలు తెలంగాణ నుంచి వచ్చిన సంప్రదాయ సాహిత్య చరిత్రలో కనిపిస్తాయి.

తెలంగాణ సాహిత్య చరిత్ర మీద ఈ మధ్యకాలంలో, ముఖ్యంగా తెలంగాణ అస్తిత్వ ఉద్యమకాలంలో విస్తృతమైన పరిశోధనలు జరిగాయి. ప్రాంతీయంగా, మౌఖికంగా ఉన్న సాహిత్యాల దగ్గర నుంచి, తెలంగాణ ప్రాంతం ప్రత్యేక చరిత్రలో అనేక విశేషాలను పరిశోధకులు గుర్తించారు. అందుకు నేపథ్య రాజకీయ, సామాజిక కారణాలు ఉండవచ్చును కానీ, ప్రాదేశికమయిన ప్రత్యేక ధోరణులు ఉండడం వాస్తవం. ప్రాకృత సాహిత్యం దగ్గర నుంచి, శాసన సాహిత్యం దగ్గర నుంచి, తొలికవులు ప్రస్తావించిన ప్రజాసాహిత్యం దగ్గర నుంచి, ప్రజా జీవనానికి దగ్గరగా ఉన్న వాఙ్మయం కనిపిస్తుంది. మహాభారత అనువాదాలకాలం, పురాణ, కావ్యయుగం, ప్రబంధ, ప్రబంధానంతర యుగం అంటూ జరిగిన యుగవిభజనకు తెలంగాణ సాహిత్యక్రమం అనువుగా లేదు. ఆదికవిత్రయంలో ఒక్కరు కూడా ఈ ప్రాంతీయులు కారు. వారి రచనాకాలంలో, స్వతంత్ర కావ్యాలు వచ్చాయి. సామాజిక, మత ఉద్యమాల నేపథ్యంలో, చారిత్రక వ్యక్తుల జీవితకావ్యాలు వచ్చాయి. మహాభారతం జోలికి పోకుండా రామాయణాన్ని దేశీఛందస్సులోను, మధురభక్తి ప్రభావం కలిగిన భాగవతకావ్యం తెలుగు అనువాదం సులువైన శైలీకథనాలతో వచ్చింది. పోతన వంటి సహజ కవే తప్ప, శ్రీనాథుడి వంటి బాహుబలి కవి తెలంగాణలో లేరు.ప్రబంధయుగ ప్రతిఫలనాలే తెలంగాణలో కనిపించవు. ప్రత్యేక రాజ్యపరిస్థితులు కావచ్చును కానీ, కాకతీయుల తరువాత (వారి కాలంలోనూ ప్రత్యక్షంగా తెలుగు కవుల ఆస్థాన పోషణ కనిపించదు) కాలంలో స్థానిక, ప్రాంతీయ పాలకులో, సేనాధిపతులో తప్ప కావ్యాలను అంకితం తీసుకున్నవారు లేరు, ఫలితంగా, సాహిత్యం వికేంద్రీకృతం అయి, ఏదో ఒక ధోరణి ఆధిపత్యం చెలాయించడానికి కుదరలేదు.

ఆంధ్రావళి మోదమున్బొరయ– భారతం రాస్తున్నానని తిక్కన సోమయాజి చెప్పినప్పుడు, తెలుగు వారందరినీ ఉద్దేశించినట్టు కనిపించింది కానీ, ఆయన రచనా విధానం మార్గశైలిలోనే భాగం. సద్ద్విజశ్రేయమైన భాగవతం రాస్తున్నప్పటికీ, దాన్ని జగద్ధితంగా రాస్తున్నానని ఒక ప్రయోజనాన్ని పోతన చెప్పుకున్నాడు. ఆయనది కూడా స్థూలంగా మార్గపద్ధతే. 'సంస్కృత భూయిష్ఠ రచన మానుగా సర్వసామాన్యంబుగా మిజాను తెనుగు విశేషము ప్రసన్నతకు' అని పండితారాధ్య

చరిత్రలోను,'జానుతెనుంగు చర్చింపగా నర్వసామాన్యమగుట' అని బసవపురాణంలోను చెప్పి, విస్తృతప్రజానీకాన్ని (బహుజనాన్ని) దృష్టిలో పెట్టుకుని తెలుగులో రాస్తున్నానని పాల్కురికి సోమన విస్పష్టంగా చెప్పారు. సాధారణ జనులను దృష్టిలో పెట్టుకుని రాయడం అనే ఒక విలువను లిఖిత సాహిత్య తొలిదశలోనే చెప్పడం ఆది స్వతంత్రకవి ప్రత్యేకత. ఒకటి రెండు అచ్చతెనుగు పద్యాలు రాయడానికే కష్టపడుతున్నారు కానీ, నేను మొత్తం అచ్చ తెలుగుకావ్యం రాసి చూపిస్తాను అనిపొన్నెగంటి తెలగన్న'యయాతిచరిత్ర' రాసి, ఒక తురుష్క పాలక ప్రముఖుడికి అంకితం ఇచ్చాడు. వృషాధిపశతకం దగ్గర నుంచి సుమతి శతకం నుంచి దాశరథి శతకం దాకా, ప్రజల నాలుకల మీద ప్రవహించే పద్యాలను రాసిన తెలంగాణ కవులు సామాన్య ప్రజలకు దగ్గరగా మెలిగారు.

ప్రజలు– అన్నమాట పాతదేకానీ, దాని వర్తమాన అర్థం ఇటీవలిది. ప్రజ– అంటే సంతానం. ప్రభువు లేదా పాలకుడి సంతానంగా ప్రజలను భావించారు. చక్రవర్తులు కానీ, బ్రిటిష్, మొగల్ సామ్రాజ్యాధిపతులు కానీ, జనులను పాలితులు (సబ్జెక్ట్స్)గా చూశారు. కొన్ని హక్కులు, ధర్మాలు, ప్రాతినిధ్య కాంక్ష కలిగిన పౌరులుగా ప్రజలను భావించడం ఆధునిక కాలంలోనే వచ్చింది. తెలంగాణలో మొట్టమొదటి ఆధునిక మహిళాకవిగా చెప్పదగిన రూప్‌ఖాన్ పేట రత్నమ్మ, 1913లోనే 'హితబోధిని' పత్రికలో, 'ప్రజలను' ప్రస్తావించారు.

"మనకుదెలియకున్నమనుదారిమనసాటి /ప్రజలజూచియైనబడయరాదె/ సాధుజనులగూడిసంఘమేర్పాటుగా/వించిదుర్గుణములదృంచరాదె"-- అని ఆమె రాశారు. బ్రిటిషాంధ్రలోని తెలుగువారు చేస్తున్న సంఘనిర్మాణ ప్రయత్నాలను తెలంగాణలోని ప్రజలుకూడా అనుసరించాలని ఆమె భావించారు. 'హితబోధిని' పత్రిక సంపాదకుడు బి. శ్రీనివాసశర్మ కూడా 'జనులను' స్వతంత్రంగా వ్యవహరించవలసిన సమూహంగా గుర్తించారు.

"తనదుసంసారమా! కొంతతక్కువైన /నధిపుడెంతయుసంతాపమందునట్లు/ దేశమునఎంతలోపమేదియున్న/ దేశజనులెల్లదీర్వచింతించవలయు"– ఒక పౌరసమాజ భావన ఈ పద్యంలో కనిపిస్తుంది. గురజాడ రాసిన దేశం, మనుషులు అన్న భావనల లోతు ఇటువంటి వ్యక్తీకరణలలో లేకపోయినా, ఆధునిక సామాజిక వ్యక్తి అవతరణను తెలంగాణ పద్యాలు కూడా సూచిస్తున్నాయి. 1930లలో వచ్చిన

'గోలకొండ కవుల సంచిక' లో , అందుకు ముందు వచ్చిన శేషాద్రిరమణకవుల ' నిజాం రాష్ట్ర ప్రశంస'లో తెలంగాణ జాతీయ భావన, ప్రజల ఆచరణను కోరే తపన కనిపిస్తాయి. ప్రజలు, జనులు అన్నమాటలు ఆధునికార్థంలో స్థిరపడకముందు లోకులు, రైతులు అన్నమాటలే విస్తృత వినియోగంలో ఉండేవి. 1885 ప్రాంతంలో వచ్చిన 'శేద్యచంద్రిక' అనే తెలంగాణ తొలి పత్రికలో ప్రజలు అన్నమాట లేదు. లోకులు, రైతులు అని మాత్రమే వాడారు. పాలకులు ప్రభువులు వీరెవరూ కాదు, అన్నం పెట్టేది రైతులే అన్నఅర్థం వచ్చే పద్యం 'హితబోధిని'లో కనిపిస్తుంది. 1930ల లోనే రైతుకవి గంగుల శాయిరెడ్డి తన 'కాపుబిడ్డ' కావ్యంలో "పన్ను దప్పదు పంటలు మంటగలియు/ అందరికి కూడుగుడ్డలు చెందవలయు /కర్షకా లెమ్ము కనువిప్పి కట్టునడుము' అని రాశారు. 1940 ల చివరికి వచ్చే సరికి దాశరథి 'తెలంగాణము రైతుదే, ముసలినక్కకు రాచరికంబు దక్కునే' అని గర్జించారు.

దళితుల మీద చేసే దారుణాలను విమర్శను ప్రశ్నించిన కవిత 'గోలకొండ కవుల సంచిక'లో కనిపిస్తుంది. అరిగే రామస్వామి అనే దళిత నాయకుడు రాసిన ఈ వద్యాన్ని చూడండి.''హిందుమతముజీవహింసనునోర్వదు/ మాలమాద్గలన్నమండిపడును/దననుహింసజేయుదగనలాములుజేయు/ రక్తబంధులారరైతులార" (గోలకొండ కవుల సంచిక) దీని సమకాలంలోనే ఆంధ్రప్రాంతం నుంచి వచ్చిన 'వైతాళికులు'అన్న ఆధునిక కవితాసంకలనంలో జాషువాకు ప్రాతినిధ్యం దొరకలేదన్న విమర్శ తెలిసిందే. 'గోలకొండ కవుల సంచిక'లో దళితకవి ఒకరు ఉండడమే కాకుండా, ఆ సంకలనంలోని కవుల వివరాలను సామాజిక నేపథ్యాలతో సహా సంపాదకుడు సురవరం ప్రతాపరెడ్డి జాబితా ఇచ్చారు.

ఆధునిక సాహిత్య యుగాలుగా చెప్పిన భావ, అభ్యుదయ సాహిత్యాలు తెలంగాణలో ప్రధానమైన స్రవంతులుగా లేవు. అభ్యుదయ కాలంలో తెలంగాణలో వచనసాహిత్యం, పద్యాలు, అసంఖ్యాకంగా పాటలు స్థానిక రాజకీయ పరిస్థితులను, పోరాటాలను ప్రతిఫలించాయి. వచనకవిత్వం ఉన్నది కానీ, ఆంధ్రప్రాంత కవులదే నాయకత్వంగా ఉండింది. దిగంబర కవిత్వంలో ఇద్దరు మాత్రమే తెలంగాణ కవులున్నారు. 1970కు ముందు తరువాత, తెలంగాణలో కవిబృందాలు తిరుగుబాటు స్వరాలను విప్పి, విప్లవసాహిత్యోద్యమానికి పూర్వరంగం సిద్ధం చేశారు. ఆ తరువాత తెలంగాణలో పాట, కవిత, కథ అన్నీ ప్రజా ఉద్యమాల స్వరాలుగా, ప్రేరకాలుగా, చిత్రణలుగా కొనసాగాయి. గద్దర్, చెరబండరాజు,వరవరరావు దెబ్భయిల తరువాతి

తెలంగాణ కల్లోలాన్ని, ప్రతిఘటనను అక్షరంలో, గానంలో పలికారు. దళిత, స్త్రీవాద, మైనారిటీ వాదాల ప్రారంభం, ఉధృతి ఇతర ప్రాంతాలలో జరిగినా, తెలంగాణ కవి వాటి లోని సానుకూల విలువలను జీర్ణం చేసుకుని, స్వీకరించి, ఆచరించి భాగస్వామి అయ్యారు. ఆయా ఉద్యమాల కొనసాగింపు ఇప్పుడు తెలంగాణలోనే అధికంగా కనిపిస్తుంది. బహుఅస్తిత్వాలు ఇప్పుడు ఏకకాలంలో వేదికను పంచుకుంటున్నాయి.

గ్రామీణ పోరాటాలను చిత్రించిన సాహిత్యం, 1990లలో తెలంగాణ గ్రామీణ వనరుల, జీవనాధారాల సంక్షోభాన్ని రాసిన తెలంగాణ కవి, ఆ దశాబ్దం చివరకు వచ్చేసరికి, ప్రాంతీయఅస్తిత్వాన్ని, వనరులపై స్థానికాధికారం కోసం కావలసిన పరిష్కారాన్ని పాడడం మొదలుపెట్టాడు. ఈ దశలో తెలంగాణ అస్తిత్వ సాధికారతా ఉద్యమానికి సాహిత్యనాయకత్వం పాటనే వహించింది. కానీ, వచన కవిత్వం కూడా పెద్ద ఎత్తున ఉద్యమంలో భాగస్వామి అయింది.

తెలంగాణ సాహిత్యంలో ప్రజలగొడవను ఏదో ఒక మేరకు పట్టించుకునే ధోరణి చారిత్రక కాలం నుంచి ఉన్నది. ప్రగతిశీల, సానుకూల అంశాలకు ఒక పరంపర ఉండడం, దానిని గుర్తించగలగడం అస్తిత్వ అభిమానానికి ఎంతో కీలకం. అట్లాగని తెలంగాణ సాహిత్య చరిత్రలో, వర్తమాన చరిత్రలోను, ప్రజల గొడవను పట్టించుకోని లేదా దానికి ప్రాధాన్యం ఇవ్వని వ్యక్తులు, సంస్థలు, ధోరణులు లేవని కావు.

అధికారపీఠాలకు అలనాడే దూరంగా ఉంటూ, స్వాభిమానాన్ని, సాహిత్యరంగ ప్రతిపత్తిని ప్రకటిస్తూ వచ్చిన తెలంగాణ సాహిత్యకారులు ఎప్పటికైనా ఆదర్శమే అవుతారు. కాళోజీ నారాయణరావు ప్రజాకవి అనిపించుకున్నారంటే, ఆయనది ప్రజల గొడవ కావడమే. ఆయనను శ్రీశ్రీ లూయీ ఆరగాన్తో పోల్చారు. ఫ్రాన్సును జర్మన్లు ఆక్రమించినప్పుడు, ఫాసిస్టులకు వ్యతిరేకంగా ప్రతిఘటన నిర్మించిన ముఖ్యసాహిత్యవ్యక్తులలో లూయి ఆరగాన్ఒకరు. తెలంగాణ తొలిదశ ఉద్యమం నుంచి, మలిదశ దాకా ఒక వివక్షా వ్యతిరేక ఆత్మాభిమాన ప్రకటనకు కాళోజీ ప్రతీకగా ఉన్నారు. ఎమర్జెన్సీ దగ్గర నుంచి సమస్త అప్రజాస్వామిక ధోరణలను ప్రతిఘటించారు. దుష్పరిపాలనను, సామాజిక అన్యాయాలను నిరసించారు. మత సామరస్యాన్ని కోరుకున్నారు. తెలంగాణ తన గురించి తాను గర్వపడే వ్యక్తిత్వ ప్రతీకగా ఆయన మిగిలిపోయారు.

ఆత్మాభిమాన ప్రకటనకు కాళోజీ ప్రతీకగా ఉన్నారు. ఎమర్జెన్సీ దగ్గర నుంచి సమస్త అప్రజాస్వామిక ధోరణలను ప్రతిఘటించారు. దుష్పరిపాలనను, సామాజిక అన్యాయాలను నిరసించారు. మత సామరస్యాన్ని కోరుకున్నారు. తెలంగాణ తన గురించి తాను గర్వపడే వ్యక్తిత్వ ప్రతీకగా ఆయన మిగిలిపోయారు.

BIO-DATA



Dr.K. SRINIVAS, Former editor Andhra Jyothi. Dr. Srinivas was awarded Ph.D in 1999 from Sahitya Peetham, Telugu University, M.C.J (2018) Department of Journalism Telugu University M.A.(1981), M.Phil (1989) Telugu Department, Osmania University. He worked as editor Till October 2024. He also Worked with Udayam, Andhra Jyothy, Vaartha (all dailies), and with some periodicals.

He Designed and run literary special pages in Andhra Jyothy (Vividha) Udayam (Veekshanam). Major Publications: Tellarani Telangana (A collection of column articles on Telangana politics 2014-2024), Malupu Publications, 2024. Bulldozer Sandarbhalu (A collection of column articles on National Politics 2014-2024), Malupu Publications, 2023. K.Srinivas ampaadakeeyaalu (Editorials written for Andhra Jyothi daily for the 15 years), Emesco Publishers, 2020. Telanganalo Sahitya Vikasam (Ph.D thesis submitted P.S. Telugu University in 1999), Telangana Prachuranalu, 2015. June 2 (Andhra Jyothi columns on State bifurcation and on Telangana development), November 2014. Aneka Sandarbhalu (Andhra Jyothi columns on various issues), December 2013. Kotta Vantena (Columns appeared in Prajatantra weekly during 2000-2002 on early days of Telangana movement), October 2013. Sambhashana (A collection of weekly columns written in Andhra jyothi during 2005-2008). Published hundreds of articles, literary essays, prefaces, reviews and critiques in various daily, weekly newspapers, literary journals and websites.

Awards: Taapee Dharmaarao Memorial Award by Telugu Bhashodyama Samakhya, 2012. C.Y. Chintamani Award in Journalism, 2016. N.R. Chandur Award in Journalism 2016.D. Sripada Rao Award for Journalism, 2016; Madala Veerabhadra Rao memorial Award for Journalism, 2017; Devulapalli Ramanuja Rao Memorial literary AWard, 2019; Somasundar Memorial Literary Award, 2017; Gajjala Mallareddy Memorial Award, 2022.

Reimagining Open and Distance Learning for the Digital Age

Strategic Transformation Framework



Dr. B.R. AMBEDKAR OPEN UNIVERSITY
Hyderabad, Telangana